అక్షర విజేత
Email: vijethatelugudaily@gmail.com
రిపోర్టర్స్ కావలెను
బి. అనిల్‌కుమార్, ఎడిటర్
77028 66885



తెలుగు జాతీయ దినపత్రిక
అక్షర
# విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక



B. ANIL KUMAR
CHAIRMAN & CHIEF EDITER
7702866885
9059324231
అక్షర విజేత
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక
DAIWIK PUBLICATIONS & BROADCASTING PVT. LTD.
www.aksharavijetha.com., epaper.aksharavijetha.com
email : vijethatelugudaily@gmail.com
కావలెను
విజేత ఛానల్‌లో పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి విలేకరులు, యాంకర్లు, న్యూస్ ఎడిటర్లు, కంటెంట్ రైటర్స్, కెమెరా మెన్, మరియు స్టూడియోలో పనిచేయుటకు స్త్రీ & పురుష సిబ్బంది కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఉంటుంది.
సంప్రదించుటకు: 7702866885, 9059324231



ఆంధ్రప్రదేశ్ సంపుటి:05 సంచిక :107 ఎడిటర్ : బి. అనిల్ కుమార్ పేజిలు : 10, వెల. 6రూ/ మంగళవారం 10 ఫిబ్రవరి 2026




## అంబటి రాంబాబుకు
# షాక్...

**మరో కేసులో రిమాండ్ విధించిన కోర్టు**

-పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీ నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ ఆందోళన

-ఆ సందర్భంగా పోలీసు విధులకు ఆటంకం కలిగించిన అంబటి

-14 రోజుల రిమాండ్ విధించిన స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు

ఇప్పటికే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును దుర్భాషలాడిన కేసులో రిమాండ్ లో ఉన్న వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో షాక్ తగిలింది. మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ చేసిన ఆందోళన కార్యక్రమం సందర్భంగా... బ్యారికేడ్లను తోసివేసి, పోలీసు విధులకు ఆటంకం కలిగించారనే కేసులో ఆయనకు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ నెల 22వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు, చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అంబటి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై గుంటూరు మొబైల్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ విచారణ అనంతరం ఆయనను తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై
# నిర్లక్ష్యం వద్దు

-వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం

-హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై కీలక వ్యాఖ్యలు... అధికారులదే బాధ్యత అని హెచ్చరిక

-క్షేత్రస్థాయిలో పర్యటించి పాలన అమలును పరిశీలించాలని మంత్రులకు సూచన

-గత ప్రభుత్వ అప్పుల వల్ల అధిక వడ్డీలు చెల్లిస్తున్నామని వెల్లడి

-త్వరలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకురానున్నట్లు ప్రకటన

వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పటిష్టమైన చర్యలు చేపట్టాలని, హాస్టళ్లలో విద్యార్థులు అనారోగ్యం పాలైతే సంబంధిత జిల్లా కలెక్టర్లు, మంత్రులనే బాధ్యుల్ని చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గట్టిగా హెచ్చరించారు. ప్రభుత్వ పాలసీలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు మంత్రులు, కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పాలసీలు సమర్థవంతంగా అమలైతేనే ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

సోమవారం అమరావతి సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల రాష్ట్రం 14 శాతం అధిక వడ్డీతో అప్పులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన

2



వ్యక్తం చేశారు. ఆర్థిక క్రమశిక్షణను గాడిలో పెట్టి, రాష్ట్ర క్రెడిట్ రేటింగ్ పెంచడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకునేందుకు రుణాలను రీషెడ్యూల్ చేస్తున్నామని వివరించారు. ప్రతి ఐదేళ్లకు జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## బంగ్లాదేశ్ చొరబాట్లను ఉద్దేశించి చేసిన పోస్టుకు
# కట్టుబడి ఉన్నా

తనపై పిర్యాదు చేస్తే అరెస్టుకు కూడా సిద్ధమన్న హిమంత బిశ్వ శర్మ

బంగ్లాదేశ్ చొరబాట్ల అంశంపై తన వైఖరి మారదన్న హిమంత బిశ్వ శర్మ



2

# ఆర్ఎస్ఎస్ వల్లే బీజేపీకి ‘అచ్ఛే దిన్’

-శతాబ్ది ఉత్సవాల్లో మోహన్ భగవత్ వ్యాఖ్య

-రామాలయం నిర్మాణంపై ఆర్ఎస్ఎస్ పట్టుదలగా వ్యవహరించిందని వెల్లడి

-ఆలయ నిర్మాణానికి సహకరించిన పార్టీలు లాభపడ్డాయని వివరణ

2




## 204 అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణతో
# పేదల ఆకలి తీరుస్తున్నాం

-రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని ప్రకటన

--మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీ పూర్తి చేశామన్న ముఖ్యమంత్రి

-గత ప్రభుత్వ హయాంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైందని విమర్శ

-2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్న చంద్రబాబు

2



సంక్షేమ పథకాల అమలు నుంచి భారీ పెట్టుబడుల ఆకర్షణ వరకు తమ ప్రభుత్వ పాలన దార్శనికతను, భవిష్యత్ లక్ష్యాలను ముఖ్యమంత్రి సమగ్రంగా వివరించారు. రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూనే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను, అధికార దుర్వినియోగాన్ని ఎండగట్టారు. పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 204 అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించామని, గత ప్రభుత్వం వీటిని రద్దు చేసి పేదవాడి కడుపు కొట్టిందని విమర్శించారు.గత పాలనలో జరిగిన భూ అక్రమాలపై ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. “తాడేపల్లి ప్యాలెస్ వద్ద హెలిపాడ్ కోసం ఒక ప్రైవేటు భూమిని అక్రమంగా 22ఏ నిబంధన కింద చేర్చారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఈ స్థాయిలో అధికారాన్ని దుర్వినియోగం చేయడం దారుణం. ఇది కేవలం తాడేపల్లికే పరిమితం కాలేదు, రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇలాంటివి జరిగాయి“ అని వ్యాఖ్యానించారు. దీనికి పరిష్కారంగానే భూవివాదాలు లేని పకడ్బందీ సర్వే ప్రక్రియను చేపట్టామని, క్యూఆర్ కోడ్, ఇతర భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు.

# కేంద్రం నిధుల కేటాయింపులో తెలంగాణపై తీవ్ర వివక్ష చూపుతోంది

- మున్సిపల్ ఎన్నికల వేళ బీజేపీ, బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనే నేటి సమస్యలకు కారణమని, వారితో బీజేపీకి రహస్య బంధం ఉందని వ్యాఖ్య

-తమ రెండేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చామని, అభివృద్ధి చేసి చూపించామని వెల్లడి

-మూడు పార్టీల పాలనను బేరీజు వేసుకుని ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి



2

## చెన్నైలోని విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు
# స్థానాలపై విజయ్ గురి

పట్టణ, ప్రాంతీయ ఓటర్లను ఆకట్టుకునేందుకు పక్కా వ్యూహం

రెండు స్థానాల్లోనూ అధికార డీఎంకేతోనే విజయ్ ప్రధాన పోటీ

2



# విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు:

ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి

ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు. జూలై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ పూర్తి చేయాలని, 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. గర్భిణుల్లో సిజేరియన్లు తగ్గించి, సాధారణ ప్రసవాలు పెరిగేలా అవగాహన కల్పించాలన్నారు. మాతాశిశు సంరక్షణ కోసం 'కేర్ అండ్ గ్రో' కార్యక్రమాన్ని, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించాలని చెప్పారు. రాష్ట్ర జనాభా నిర్వహణ కోసం మార్చి నాటికి 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకురానున్నట్లు సీఎం వెల్లడించారు.

విద్యారంగంలో ఒత్తిడి లేని విద్యావిధానం అమలు చేయాలని, పదో తరగతి ఫలితాల్లో మెరుగుదలకు 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆత్మహత్యలు జరగకూడదని, నూతన ఆవిష్కరణలకు స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలని అభిప్రాయపడ్డారు.

నీటి సంరక్షణ, అభివృద్ధిపై కీలక సూచనలు

రాష్ట్రంలోని 38 వేలకు పైగా ఉన్న చిన్న నీటిపారుదల చెరువులను పరిరక్షించాలని, భూగర్భ జలాలను 'నీటి బ్యాంకు' తరహాలో వాడాలని సూచించారు. పారిశ్రామిక కాలుష్యంతో జలాలు కలుషితం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమ పువ్వు సాగు, ఏలూరు సమీపంలో కోకో సిటీ ఏర్పాటు వంటి వినూత్న ప్రాజెక్టులకు అవకాశాలున్నాయని, వీటిని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్‌ఎస్‌ఎస్ వల్లే బీజేపీకి 'అచ్చే దిన్'

దేశంలో బీజేపీ అప్రతిహత విజయాలకు ఆర్‌ఎస్‌ఎస్ విధానాలే కారణమని, సంఘ్ వల్లే బీజేపీకి అచ్చే దిన్ వచ్చాయని మోహన్ భగవత్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముంబైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో ఆర్‌ఎస్‌ఎస్ కు అచ్చే దిన్ వచ్చాయన్న వ్యాఖ్యలపై భగవత్ స్పందించారు.

నిజానికి బీజేపీ అధికారంలోకి రావడానికి, ఆ పార్టీకి మంచి రోజులు రావడానికి కారణం ఆర్‌ఎస్‌ఎస్ అని చెప్పారు. అయోధ్యలో రామాలయం నిర్మాణం విషయంలో సంఘ్ పట్టుదలగా వ్యవహరించడం, ఈ ఉద్యమానికి సహకరించిన పార్టీలకు ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. దీంతోపాటు స్వయంసేవకుల కఠోర శ్రమ కూడా ఉందని భగవత్ స్పష్టం చేశారు.

**సావర్కర్‌కు భారతరత్నపై..**

హిందుత్వ సిద్ధాంతకర్త వీర్ సావర్కర్‌కు 'భారతరత్న' ఇవ్వాలనే డిమాండ్‌పై భగవత్ స్పందించారు. అవార్డు కమిటీలో తాను లేనని చెబుతూ.. ఆ కమిటీలో ఉన్న వారిని కలిస్తే ఈ విషయం తప్పకుండా ప్రస్తావిస్తానని చెప్పారు. నిజానికి సావర్కర్ కు భారతరత్న ఇస్తే ఆ అవార్డుకే ఖ్యాతి పెరుగుతుందని చెప్పారు. ఎలాంటి పురస్కారాలు పొందకున్నా కూడా సావర్కర్ కోట్లాది భారతీయుల హృదయాల్లో చక్రవర్తిగా నిలిచారని భగవత్ కొనియాడారు.

**ఉపాధి కల్పనపై..**

భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి 'మాస్ ప్రొడక్షన్' (భారీ ఉత్పత్తి) కంటే 'ప్రొడక్షన్ బై మాసెస్' (ప్రజల భాగస్వామ్యంతో ఉత్పత్తి) జరగాలని భగవత్ పిలుపునిచ్చారు. ఒకేచోట భారీగా ఉత్పత్తి చేయడం కంటే ఎక్కువ చోట్ల చిన్న తరహా ఉత్పత్తి జరిపితే వస్తువుల ధరలు తగ్గుతాయని చెప్పారు. అప్పుడు కంపెనీల మధ్య పోటీ ధరలపై కాకుండా వస్తువుల నాణ్యతపైకి మారుతుందని వివరించారు. నాణ్యత బాగుండేలా జాగ్రత్త పడితే మన వస్తువులకు విదేశాల్లోనూ డిమాండ్ పెరుగుతుందని తెలిపారు.

**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై..**

మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతలను స్వాగతించాల్సిన అవసరం ఉందని మోహన్ భగవత్ చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి వాటిపై పట్టు సాధించాలని సూచించారు. అయితే, టెక్నాలజీ అనేది ఉద్యోగాలను హరించేదిగా ఉండకూడదని, ఉపాధికి భంగం కలగకుండా ఏఐని ఎలా ఉపయోగించుకోవాలో మనం నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు.

# కేంద్రం నిధుల కేటాయింపులో తెలంగాణపై తీవ్ర వివక్ష చూపుతోంది

మున్సిపల్ ఎన్నికల వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రతిపక్షాలైన బీజేపీ, బీఆర్‌ఎస్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పన్నెండేళ్ల బీజేపీ, పదేళ్ల బీఆర్‌ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొందని తెలిపారు.

బీజేపీపై ఘాటు విమర్శలు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. "మనం కేంద్రానికి పన్నుల రూపంలో రూపాయి ఇస్తే, తిరిగి మనకు 42 పైసలే ఇస్తున్నారు. అదే ఉత్తరాది రాష్ట్రాలైన బీహార్‌కు రూ.6.06, యూపీకి రూ.2.90 ఇస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలపై ఈ వివక్ష ఎందుకని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా మోదీని ప్రశ్నించారా?" అని నిలదీశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని 2014లో హామీ ఇచ్చి మోసం చేశారని గుర్తుచేశారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో వరద బాధితులకు కారుకు కారు, బైకుకు బైకు ఇస్తామని చెప్పిన బీజేపీ నేతలు, ఆ తర్వాత ఆ హామీని గాలికొదిలేశారని విమర్శించారు. "గల్లీ ఎన్నికకు ప్రధాని మోదీకి ఏం సంబంధం? ఆయనేమైనా వచ్చి మోరీలు తీస్తారా?" అంటూ ఎద్దేవా చేశారు.

బీఆర్‌ఎస్‌ను యాసిడ్‌తో కడగాలి

గత పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన బీఆర్‌ఎస్, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతోందని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. "పదేళ్ల పాటు సర్పంచ్ నుంచి మున్సిపల్ వరకు పెత్తనం చెలాయించి, సమస్యలకు కారణమైన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులే ఇప్పుడు పరిష్కరిస్తామని చెప్పడం హాస్యాస్పదం. అహంకారంతో గంజాయి, కొకైన్ తీసుకున్న వారిలా మాట్లాడుతున్నారు. టెలిఫోన్ ట్యాపింగ్ ద్వారా వందల కోట్లు దోచుకున్నారు. విచారణకు పిలిస్తే ముసుగులు వేసుకుని వెళ్తున్నారు" అని తీవ్రంగా విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీలది 2023 వరకు విడదీయలేని బంధమని, నోట్ల రద్దు నుంచి రైతు చట్టాల వరకు అన్నింటికీ బీఆర్‌ఎస్ మద్దతిచ్చిందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను అరెస్టు కాకుండా బీజేపీనే కాపాడుతోందని, యాసిడ్ పోసి కడిగితే తప్ప రాష్ట్రానికి పట్టిన బీఆర్‌ఎస్ పీడ వదలదని సంచలన వ్యాఖ్యలు చేశారు.

రెండేళ్లలో చేసి చూపించాం

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే అనేక హామీలను నెరవేర్చిందని రేవంత్ రెడ్డి వివరించారు. "ఉద్యోగులకు మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నాం. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. రైతు రుణమాఫీ పూర్తి చేసి, వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. ఇందిరమ్మ ఇళ్ల కింద రూ.5 లక్షల సాయం అందిస్తున్నాం" అని తమ ప్రభుత్వ విజయాలను ఏకరువు పెట్టారు. బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ సమస్యలకు పరిష్కారం చూపించామని తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో పోరాడతామని స్పష్టం చేసిన సీఎం, మరో ఎనిమిదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించి గెలిపిస్తే, అభివృద్ధి చేసే పూర్తి బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి..

**-ఆటో వర్కర్స్ కి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.. -జిల్లా సిఐటియు కార్యదర్శి రాయల మాలకొండయ్య డిమాండ్..**



వెలిగండ్ల,

ఆటో వర్కర్లకి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సోమవారం మండల కేంద్రంలో ఆటో వర్కర్స్ తో ఖాసీం అధ్యక్షతన గ్రూప్ చర్చలు జరపడం జరిగినది. అనంతరం వారు మాట్లాడుతూ, దేశములో వ్యవసాయ రంగం తర్వాత రోడ్డు ట్రాన్స్పోర్ట్ రంగంలో ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్లు ఉపాధి పొందుతున్నారని జిల్లా సిఐటి యుకార్యదర్శి రాయల మాలకొండయ్య అన్నారు. కేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత మోటార్ సైకిల్ సవరణసట్టం 2023 తీసుకువచ్చి రవాణారంగంపై బారాలు పెంచారని , మన దేశ మార్కెట్లో ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లు నష్టపోయారని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ తేవటం ద్వారా ఉన్న కార్మిక చట్టాలను సమాధి చేశారని, పనిగంటలకు పరిమితి లేదని ,సంక్షేమ చట్టం గురించి ఊసే లేదని, యాక్సిడెంట్ జరిగితే డ్రైవర్లకు వైద్య సదుపాయం గురించి గానీ ,మృతి చెందితే చట్ట ప్రకారం రావలసిన నష్టపరిహారం పై స్పష్టత లేదని వారన్నారు. వాహనాల ఇన్సూరెన్స్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, ఆర్టిఓ ఆఫీస్ లో చాలానా చార్జీలు, రోడ్డు టాక్సీ, గ్రీన్ టాక్స్, ఫిట్నెస్ సర్టిఫికేట్ జారీ, పెట్రోల్, డీజిల్ చార్జీలు విపరీతంగా పెంచారని వారన్నారు. ఈ డిమాండ్స్ పై ఈనెల 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో జరిగే సమ్మెలో ఆటో వర్కర్స్ అందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు. అనంతరం సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆటో కార్మికులకు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో మదార్ ,సిద్దయ్య, నారాయణ, ఖాసీం తదితరులు పాల్గొన్నారు

# బంగ్లాదేశ్ చొరబాట్లను ఉద్దేశించి చేసిన పోస్టుకు కట్టుబడి ఉన్నా

మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తనపై హైదరాబాద్ నగర సీపీకి ఫిర్యాదు చేయడంపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందించారు. తాను బంగ్లాదేశ్ చొరబాట్లను ఉద్దేశించి చేసిన పోస్టుకు కట్టుబడి ఉన్నానని, తనపై ఫిర్యాదు చేస్తే అరెస్టుకు కూడా సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు.తాను చేసిన పోస్టుకు తనపై చట్టపరమైన చర్యలు తీసుకున్నా ఎటువంటి అభ్యంతరం లేదని అన్నారు. "నేను జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. నేనేం చేయగలను. నాకు ఏ వీడియో గురించి తెలియదు. అతను (అసదుద్దీన్ ఒవైసీ) నాపై కేసు నమోదు చేసి ఉంటే నన్ను అరెస్టు చేయవచ్చు. నాకేమీ అభ్యంతరం లేదు" అని హిమంత బిశ్వ శర్మ అన్నారు.తాను చొరబాటు అంశం గురించి స్పందించానని, ఆ విషయంలో తన వైఖరి మారదని స్పష్టం చేశారు. నేను నా మాటకు కట్టుబడి ఉన్నానని అన్నారు. బంగ్లాదేశ్ చొరబాటులను తాను వ్యతిరేకిస్తున్నానని స్పష్టం చేశారు. నేను చొరబాట్లకు వ్యతిరేకంగానే ఉంటానని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో హిమంత బిశ్వ శర్మ చేసిన పోస్టుపై అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ సీపీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

# 204 అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణతో పేదల ఆకలి తీరుస్తున్నాం

**2027 నాటికి పోలవరం పూర్తి.. 20 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం**

రాష్ట్ర అభివృద్ధికి నిర్దేశించుకున్న లక్ష్యాలను వివరిస్తూ, పోలవరం ప్రాజెక్టును 2027 పుష్కరాల నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. రూ.440 కోట్లతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్‌ను గత పాలకులు ధ్వంసం చేయడం వల్ల, ఇప్పుడు దాని పునర్నిర్మాణానికి అదనంగా రూ.1000 కోట్లు ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు శ్మశానం, ఎడారి అని విమర్శించిన అమరావతిని వచ్చే మూడేళ్లలో దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా (మోస్ట్ లివబుల్ సిటీ) తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.

ఉద్యోగాల కల్పన, పారిశ్రామిక ప్రగతిపై మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులను, 5,757 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్, కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టులతో ఏపీ రూపురేఖలు మారనున్నాయని అన్నారు.

అధికారులంతా టీమ్ స్పిరిట్‌తో పనిచేసి, ప్రభుత్వ పాలన ప్రజలకు వేగంగా అందేలా చూడాలని (స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్) పిలుపునిచ్చారు. రైతుల కోసం మార్కెట్ జోక్యం, ధాన్యం కొనుగోళ్లకు తక్షణ చెల్లింపులు, రోడ్ల నిర్మాణం, ఇంటింటికీ కుళాయి, యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ వంటి పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. 2026-27 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ ఉండాలని అధికారులను ఆదేశించారు.

# చెన్నైలోని విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలపై విజయ్ గురి

నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రానికి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని విరుగంబాక్కం, మధ్య తమిళనాడులోని తిరుచ్చి తూర్పు స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.ఇది పార్టీ విస్తరణతో పాటు వ్యవస్థాపకుడైన విజయ్‌కు బలమైన ఆరంభం ఇచ్చేందుకు రూపొందించిన వ్యూహమని టీవీకే నేతలు చెబుతున్నారు. చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం పట్టణ ఓటర్లు, మొదటిసారి ఓటు వేయనున్న యువతలో విజయ్‌కు మంచి ప్రచారం కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు తిరుచ్చి తూర్పు నుంచి పోటీ చేయడం ద్వారా పార్టీ కేవలం చెన్నైకే పరిమితం కాదనే సంకేతాన్ని రాష్ట్రవ్యాప్తంగా పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.వాస్తవానికి వెలచ్చేరి, విక్రవాండి, నాగపట్టణం వంటి నియోజకవర్గాలను కూడా పరిశీలించినా, ఓటర్లతో ఉన్న పరిచయం, క్షేత్రస్థాయిలో పార్టీ సన్నద్ధత ఆధారంగా విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలను ఖరారు చేసినట్లు సమాచారం. విజయ్ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తుండటం, అధికార డీఎంకే బలంగా ఉండటంతో గెలుపు అవకాశాలను పెంచుకునేందుకే రెండు చోట్ల పోటీ చేయాలనే జాగ్రత్తతో కూడిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలకు డీఎంకే ఎమ్మెల్యేలు ఏ.ఎం.వి. ప్రభాకర రాజా, ఇనిగో ఎస్. ఇరుదయరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ రెండు చోట్లా పోటీ ఆసక్తికరంగా మారనుంది. త్వరలోనే విజయ్ తన ప్రచార వ్యూహాలను ప్రకటించి, బహిరంగ సభలను ముమ్మరం చేయనున్నారు.

# దిబ్బమడుగు శ్రీను,ను పరామర్శించిన - దద్దాల

సిఎస్పురం,

సీయస్ పురం టౌన్ పార్టీ నాయకులు దిబ్బమడుగు శ్రీను బైక్ ప్రమాదంలో గాయపడి కాలికి శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం సాయంత్రం పార్టీ నాయకులతో కలిసి వారి నివాసంలో ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం శ్రీను ఆరోగ్య పరిస్థితి వివరాలు అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని దద్దాల నారాయణ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి,పార్టీ జిల్లా టీచర్స్ విభాగం అధ్యక్షులు కల్లూరి రామిరెడ్డి రెడ్డి,గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,సైకం ఏడుకొండలు రెడ్డి,ఎలిక అచ్చయ్య,శ్రీరామ శ్రీనివాసులు,మన్నెం మాధవ,షేక్ ఆరీఫ్,రేగలగడ్డ నాగరాజు,మన్నేపల్లి పెద్దన్న,బీరం వెంకటేశ్వర్లు, ఆళ్ల రామసుబ్బాయ్య,అన్నేబోయిన గురురాజబాబు,బి. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాలకు దేవుడి ని వాడుకోవడం దుర్మార్గపు ఆలోచన

**- మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి.**

విజేత మంత్రాలయం:
రాజకీయాల కోసం దేవుడిని వాడుకోవడం కూటమి ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచన అని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు తిరుమల ప్రసాదం లడ్డూ తయారీకి వాడే నేయిలో జంతువుల కొవ్వు, పంది కొవ్వు, గొడ్డు మాంసం కలిసిందని తప్పుడు ఆరోపణలు చేసి కోట్లాది మంది భక్తుల మనో భావాలు దెబ్బ తీసిన దుర్మార్గపు ఆలోచనలను మానుకోవాలని హెచ్చరించారు. దేశంలో నే ప్రతిష్టాత్మక సంస్థలైన ( ఎన్ ఆర్ డి ఐ). . (ఎన్ డి డి బి) ల్యాబ్ లు ఎలాంటి కల్తీ జరగలేదని చెప్పడంతో స్వామి వారి భక్తులు కూటమి నాయకుల పై చిందరించుకుంటున్నారన్నారు. ప్రజల దృష్టి లో పూర్తి గా కిందకు పడిపోయిన చంద్రబాబు నాయుడు ఏదో రకంగా తన అబద్ధాల ను నిజాలని చెప్పడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నాడని ఇందులో భాగంగా ఇంకా ఎన్ని కుట్రలు చేయాలో అన్నీ చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిన చంద్రబాబు నాయుడు సుప్రీంకోర్టు ఆదేశాల తో జరిగినా దర్యాప్తు సంస్థల మీద దాడి చేయడం, ప్రశ్నిస్తున్న వైఎస్సార్సీపీ నాయకుల మీద దాడులు చేసి ఇళ్లను తగలబెట్టడం దారుణమన్నారు. చంద్రబాబు ఖచ్చితంగా ప్రజలకు, శ్రీ వారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి. డిమాండ్ చేశారు



# మంత్రాలయంలో100 రూమ్స్ లాడ్జి దగ్గర గుర్తు తెలియని వ్యక్తి శవం

విజేత మంత్రాలయం:
మంత్రాలయంలో గల 100 రూంలో ఒక గుర్తు చేయలేని శవము ముక్కునుంటే రక్తం కారి చనిపోయినారు అతని యొక్క వయసు ఇంచుమించు 43 సంవత్సరాలు గలదు తెల్లటి గడ్డము ఉంది. అతని బట్టలు యెల్లో కలర్ ఫుల్ షర్టు యెల్లో కలర్ ఫుల్ టీ షర్టు ఒక బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ వేసుకున్నారు అతని కుడి చేతికి ఆంజనేయస్వామి పచ్చబొట్టు కలదు మరియు రవికుమార్ అనే పేరు గలదు అతని షర్టు వెనకాల భాష టైలర్స్ గుంతకల్ 9652294551 అనే నెంబర్ కలదు. ఇతని గురించి ఎవరికైనా సమాచారం తెలిసిన యెడల మంత్రాలయం పిఎస్ సిబ్బందికి తెలియజేయగలరు
Si MANTRALAYAM -9121101152.



# టౌన్ ప్లానింగ్ అలసత్వంపై జిల్లా కలెక్టర్ తీవ్ర అసంతృప్తి

**ప్రజా సమస్యల పట్ల స్పందించే తీరు మారకపోతే చర్యలు తప్పవు**

విజేత విశాఖ బ్యూరో::
పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు, ప్రజా వినతుల పరిష్కారంలో, స్పందించే తీరులో టౌన్ ప్లానింగ్ విభాగం అనుసరిస్తున్న విధానాలను, అలసత్వాన్ని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తీవ్రంగా తప్పుబట్టారు.కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ప్రజా వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించేది లేదని స్పష్టం చేశారు, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించిన వినతులు నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించడంలో లోపాలు ఉన్నాయని, టౌన్ ప్లానింగ్ విభాగంలోని అధికారులు, సిబ్బంది తమ పనితీరును తక్షణమే మెరుగుపరచుకోవాలని సూచించారు,25 శాతం కంటే ఎక్కువ పెండింగ్ ఉన్న అధికారులకు మెమోలు జారీ చేయాలని, ప్రజా వినతుల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించిన టీపీవో6కు ఛార్జ్ మెమో ఇవ్వాలని పీజీఆరెస్ నోడల్ అధికారిని ఆదేశించారు, టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరును ఒక నెల పాటు సూక్ష్మంగా పరిశీలిస్తానని, ఆ లోపు తీరు మారకపోతే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు, పీజీఆర్ఎస్ వినతులు ఎస్.ఎల్.ఎ (సర్వీస్ లెవెల్ అగ్రిమెంట్) టైమ్‌లైన్‌ను దాటకూడదని, జాప్యం జరిగితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు, ప్రజలు కలెక్టరేట్ వరకు రాకుండానే క్షేత్రస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం చూపే విధంగా అధికారులు పనిచేయాలని, ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు, అలాగే ప్రజా వినతుల పరిష్కారంలో ప్రొసీజరల్ లాప్స్ లేకుండా జాగ్రత్త వహించాలని ఆదేశించారు,సరైన విధంగా ఎండార్స్మెంట్ ఇవ్వాలని, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడాలని



సూచించారు,జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఇన్‌చార్జి డీఆర్వో సత్తిబాబు, అడిషనల్ కమిషనర్ సత్యవేణి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు,ప్రజలు వివిధ సమస్యలపై 383 వినతులు సమర్పించారు,వాటిలో రెవెన్యూ అంశాలకు సంబంధించి 94 ఉండగా, జీవీఎంసీకి చెందినవి 106, పోలీసు శాఖవి 25, ఇతర శాఖలకు చెందినవి 158 ఉన్నాయి,వివిధ శాఖల అధికారులు హాజరైయ్యారు.

# వివిధ గ్రామాలలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు. మరియు ఉరుసు మహోత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బివి జయ నాగేశ్వర్ రెడ్డి

విజేత ఎమ్మిగనూరు:
ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు (15-02-2026) సందర్భంగా నందవరం మండలం గురుజాల గ్రామంలోని శ్రీ పర్వతవర్ధన సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించనున్న కార్యక్రమాలపై, అలాగే 23-02-2026న జరగనున్న శ్రీ శ్రీ శ్రీ సద్గురు మహాత్మ గంజహల్లి బడేసాహెబ్ స్వామి వారి 332వ ఉరుసు మహోత్సవం ఏర్పాట్లపై ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే. డాక్టర్ బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి భక్తులు, యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, వెహికల్ పార్కింగ్, విద్యుత్ సరఫరా మరియు ఆలయ ప్రాంగణంలో తగిన లైట్ల ఏర్పాటు, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, బ్యారికేడ్లు, పారిశుధ్యం, నడక మార్గాలు, నదీ ప్రాంతంలో భద్రతా చర్యలు, మరుగుదొడ్ల ఏర్పాటు, ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పండుగలు అత్యంత భక్తిశ్రద్ధలతో, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ఘనంగా నిర్వహించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో ఏఎంసీ చైర్మన్, ఎండోమెంట్ ఈఓ, రూరల్ మరియు గోనెగండ్ల సీఐలు, ఎస్ఐ, ఎంఆర్ఓ, ఎంపీడీఓలు, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్&బీ శాఖల అధికారులు, ఆర్టీసీ డీఎం, టీడీపీ మండల నాయకులు, గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు





# బాల్యం నుంచే భారతీయ సంస్కృతి నేర్పించాలి

**-ఎమ్మెల్యే బొలిశెట్టి**

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:
బాల్యం నుంచే భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని బోధించాలని శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో శ్రీ విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం 98 వ వార్షిక మహాసభలలో సోమవారం ఆయన పాల్గొన్నారు. డా. ఉమర్ అలీషా ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఠాపురంలో ఆధ్యాత్మిక పీఠాలు హిందూ ధర్మానికి దోహదపడుతున్నాయని, రాష్ట్రంలో హిందూ మతానికి గురువులు,పీఠాధిపతులు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని అన్నారు. ఉమర్ అలీషా ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు పిల్లలకు చిన్ననాటి నుండే మన దేశ సంస్కృతి బోధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం జనసేన పార్టీ నాయకులు కాకినాడ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్(బాబి) పుల్లా బాబి, చాపల రమేష్, మద్దాల మణికుమార్, అడ్డగర్ల సూరి, గట్టెం నాని, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్, సిద్ధ వీర్రాజు,మలపాక చిట్టి, నల్లగంచి రాంబాబు, బైన పాలెపు ముఖేష్, దారపురెడ్డి శ్రీనివాస్, ఉడత బాలాజీ పాల్గొన్నారు.



# "సాఫ్ట్ టెన్నిస్ విజేతలకు శాప్ చైర్మన్ రవి నాయుడు అభినందనలు"

విజేత గన్నవరం క్రీడా ప్రతినిధి:
పంజాబ్ రాష్ట్రం లుధియానా లోఈ నెల 3 నుండి 8 వ తేదీ వరకు జరిగిన 2వ ఆసియా జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆంధ్రపదేశ్ క్రీడాకారులు సత్తా చాటి పతకాలను కైవసం చేసుకున్నారు.ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి ఏ. యస్ వైసాలి అండర్ 15 డబుల్స్ విభాగం లో గుజరాత్ మహేక్ తో కలసి ఆడి పసిడి పతకం సాధించింది. అలాగే బాలుర విభాగం అండర్ 15 లో పి వి చిన్వాస్ ఉత్తర ప్రదేశ్ క్రీడాకారుడు రోహిన్ రాజ్ తో కలసి ఆడి రెండవ కాంశ్య పతకం కైవసం చేసుకున్నాడు.అలాగే అండర్ 18 బాలుర డబుల్స్ లో యం. రేవంత్ ఉత్తర ప్రదేశ్ క్రీడాకారుడు రాజ్ తో కలసి రెండవ కాంశ్య పతకం చేగిక్కించుకున్నారు. ఈ సందర్బంగా వీరు సాధించిన ప్రతిభకు శాప్ చైర్మన్ అనిమి రవి నాయుడు తన కార్యాలయం లో అభినందించారు.సాఫ్ట్ టెన్నిస్ బాల్ క్రీడలో ఉత్తమ క్రీడాకారులను ప్రోత్సాహిస్తున్న రాష్ట్ర సంఘం చైర్మన్ దారా నవీన్ కుమార్ ను ప్రశంసించారు. కాగా ఈ ముగ్గురు క్రీడాకారులు విజయవాడ కు చెందిన వారు కావడం విశేషం. తొలుత ఢిల్లీ నుండి గన్నవరం విమానాశ్రయానికి 2.30 గంటలకు చేసుకున్న పతక విజేతలను దారా నవీన్ కుమార్ స్వాగతం పలికారు.

# భృంగి వాహన సేవపై శ్రీ స్వామి అమ్మవార్లు

విజేత, శ్రీశైలం:
శ్రీశేల క్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం శ్రీ స్వామి అమ్మవార్లకు భృంగివాహనసేవ నిర్వహించబడింది.ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో భృంగి వాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. తరువాత శ్రీశైలక్షేత్ర ప్రధాన వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు.గ్రామోత్సవంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం,విన్యాసం, గిరిజన చెంచు నృత్యం తదితర కళారూపాలను ఏర్పాటు చేయడం జరిగింది.



# మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**-గుమ్మనూరు జయరాంకి సన్మానం చేసిన ఎల్ ఎల్ సీ ఛైర్మన్ నరసింహ**

విజేత మంత్రాలయం:
అనంతపురం జిల్లా.. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోమవారం మంత్రాలయంలో శ్రీ మంచాలమ్మను దర్శించుకుని శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మూల బృందావనమునకు మొక్కులు తీర్చుకున్న శ్రీ స్వామి ఆశీస్సులతో ఆశీర్వాదం పొందారు. గుంతకల్ ఎమ్మెల్యే. గుమ్మనూరు.జయరాం కు. ఎల్ ఎల్ సీ డీసీ 5 ఛైర్మెన్ బోయ నరసింహా శాలువా కప్పి, శ్రీ రాఘవేంద్ర స్వామి మెమోంటో అందజేసి సన్మానించారు. అనంతరం పలు విషయాల పై చర్చించారు... కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు మరియు ప్రోటోకాల్ మంత్రాలయం సర్కిల్ ఇన్స్పెక్టర్. పి రామానుజులు.



# సంఘం భవనానికి స్థలం ఇప్పించండి

**ఎమ్మెల్యేను కోరిన భవన నిర్మాణ కార్మిక సంఘం**

విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: తమ సంఘం భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించి సహకరించాలని ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన తాడేపల్లిగూడెం ప్రాంతీయ తాపీ వడ్రంగి సెంట్రింగ్ రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ను కోరారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను సోమవారం మర్యాదపూర్వ కంగా కలుసుకున్నారు. తాడేపల్లిగూడెం ఏరియాలో సుమారు 5000 మంది ఉత్తమ సంఘంలో సభ్యులుగా ఉన్నారని సరైన భవనం లేక ఇబ్బంది పడుతున్నామని వారు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటులో ప్రధాన భూమిక భవన నిర్మాణ కార్మికులారా వారికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా ప్రభుత్వం పూర్తి అండదండలు అందిస్తుందని సంఘం భవనానికి అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ గౌరవాధ్యక్షులు శ్రీ అంకం భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామకృష్ణ, కోశాధికారి మాధు శ్రీను, ఆర్గనైజింగ్ కార్యదర్శి కోడే సాయి బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, యూనియన్ పెద్దలు. పాలూరి లక్ష్మణరావు, బోడపాటి నాగేశ్వరరావు, రాజా వెంకటరావు, మెండెం జేమ్స్, బోడపాటి కృష్ణ, రెడ్డి శ్రీనివాస్, కామిరెడ్డి సత్యనారాయణ, దేవా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు, తోట సత్యనారాయణ, రెడ్డి మురళీకృష్ణ, దూలం ఆనంద్, పెరికల శివరామకృష్ణ, కాకర్ల రాంబాబు, సనమండ్ర విజయ్, అల్లిమెల్లి నాగభూషణం, అచ్యుత దుర్గాప్రసాద్, ఉప్పులూరి మధు, మల్లిపూడి వెంకట్రావు, కార్యదర్శులు. అత్తిలి బాబి, షేక్ బాషా, ఎర్ర వెంకటేశ్వరరావు, పల్లా బాలాజీ, చిలుకూరి శివ, పాలిశెట్టి సుబ్బారావు, తాడేపల్లి రాజు, సందక కొండ, శెట్టి సింహాచలం, దూలపల్లి ఆనంద్, బసవ సామ్యేలు, రామిశెట్టి నాగు, నాగిరెడ్డి శ్రీను, రోకళ్ళ ఏసు, గుంటుపల్లి గణేష్, ఆఫీస్ సెక్రటరీ బండారు నాగు పాల్గొన్నారు.



# ప్రమాదం పొంచి ఉంది సారూ

విజేత. గోపాలపట్నం::అదొ పెద్ద కరెంటు స్తంభం ఎ బారి వాహనం డికొందొ ఎమోగాని బాగా ప్రమాదకరంగా ఒరిగిపోయింది, విద్యుత్ వైర్లు భూమి లోకి ఉండటంతో ప్రమాదం తప్పింది లేదంటె బారి ప్రమాదమె సంభవించేది, గోపాలపట్నం నుండి ఎన్ఎడి వెల్లు మార్గంలో ఫ్లైఓవర్ ప్రారంభం లో విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగిపోయింది, దీనిని ఇప్పటిలో తొలగించక పోతె ప్రమాదాన్ని ఆహ్వానించడం అవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ప్రమాదం జరగక ముందే దీనిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు





# తిరుపతి లడ్డూలో జంతువుల క్రొవ్వు కలవలేదంటూ సిట్ నివేదిక.!

## అయినా కూటమి పార్టీలు తప్పుడు ప్రచారాలు ఆపలేదు

## రాజకీయ లబ్ధి కోసం హిందువుల మనోభావాలను దెబ్బతీయొద్దు

## హైకోర్టు అడ్వకేట్ కొసనం శ్రీనివాసరావు

విజేత మంగళగిరి




ప్రపంచంలో అతి పవిత్రమైన పుణ్య క్షేత్రాల్లో ఒకటిగా నిలిచే తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల క్రొవ్వు కలవ లేదంటూ సిట్ స్పష్టమైన నివేదిక ఇచ్చినప్పటికీ కూటమి పార్టీలు తప్పుడు ప్రచారాన్ని ఆపలేదని ప్రముఖ హైకోర్టు న్యాయవాది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు, పద్మశాలి క్షత్రియ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, హిందూ జన చైతన్య సమితి అధ్యక్షుడు కొసనం శ్రీనివాసరావు విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం సాయంత్రం మంగళగిరి పట్టణంలోని ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశాన్ని నిర్వహించి కూటమి పార్టీల తీరుపై మండిపడ్డారు. కొసనం శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాజకీయంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని అప్రతిష్ట పాలు చేయాలనే కుట్రతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బిజెపి నాయకులు తిరుపతి లడ్డు ప్రసాదంలో కల్తీ చోటు చేసుకుందంటూ, ఇందుకు కారణం జగన్మోహన్ రెడ్డి అని చేసిన ఆరోపణలు అవాస్తము అని తేలిపోయాయని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారంటూ ఎన్నికలకు ముందు విమర్శించిన నాయకులు అధికారంలోకి వచ్చాక జగన్ చేసిన అభివృద్ధిని అంగీకరించారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి క్రైస్తవుడని ఈ క్రమంలో హిందూ దేవాలయాల్లో లభ్యమయ్యే ప్రసాదాల్లో కల్తీ చేస్తాడనే ప్రచారం ద్వారా హిందువుల ఓటు బ్యాంకు ను జగన్ కి వెళ్లకుండా కుట్రకు తెర లేపారని ఆరోపించారు. ఇందు కోసం లడ్డు అంశాన్ని తెరపైకి తెచ్చారని అన్నారు. కల్తీ ఎప్పుడు జరిగింది ?ఎలా జరిగింది? ఎవరు చెప్పారు? అనేది మాత్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేయలేకపోయారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో జంతువుల క్రొవ్వు, చేప నూనె ద్వారా తయారుచేసిన నెయ్యితో లడ్డూలను తయారు చేశారని దుష్ప్రచారం చేశారని అన్నారు. ఈ క్రమంలో విచారించి నిజాలను నిగ్గు తేల్చేందుకు సిట్ ద్వారా దర్యాప్తు చేయించారని పేర్కొన్నారు. దర్యాప్తులో సిబిఐ ని కూడా భాగస్వామిని చేశారని తెలిపారు. తిరుపతి లడ్డు ప్రసాదంలో జంతువుల క్రొవ్వు కలవలేదని సిట్ స్పష్టమైన నివేదిక ఇచ్చిందని తెలిపారు. అయినప్పటికీ కల్తీ జరిగిందనే తప్పుడు ప్రచారం ఇప్పటికీ ఆపలేదని తెలిపారు. 58 లక్షల టన్నుల పామాయిల్ లో లక్ష టన్నులు కెమికల్స్ కలిపి 59 లక్షల టన్నుల నెయ్యితో కల్తి నెయ్యి తయారు చేశారని చెబుతున్నారని పేర్కొన్నారు. ఇదే నివేదికలో ఉందని చంద్రబాబు చెబుతున్నారని అన్నారు. నెయ్యిలో కలిసినటువంటి కెమికల్స్ పేర్లేమిటి ఎన్ని యూనిట్లు ఎక్కడ కలిపారు? మాన్యువల్ గా ఎంత తయారు చేశారు యంత్రాలతో ఎంత తయారు చేశారు అన్నదానిపై స్పష్ఠత లేకుండా ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. దీనిపై హైకోర్టులో తాను న్యాయవాదిగా ప్రశ్నలను సంధిస్తానని తెలిపారు. కల్తీ నెయ్యిని గుర్తించినప్పుడు ఎక్కడ సీజ్ చేశారు సీట్ చేసిన నెయ్యిని ఎక్కడికి పంపారు అన్నదానికి కూడా జవాబు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం మతపరమైన వ్యతిరేకతను తెచ్చేందుకే జగన్ పై అర్ధరహితమైన ఆరోపణలు చేస్తున్నారని ఇది ప్రజలకు ప్రస్తుతం అర్థమయిపోయిందని తేల్చి చెప్పారు. జగన్ హయాంలో కల్తీ జరగలేదని ఆయన హిందువుల వ్యతిరేకి కాదని స్పష్టం చేశారు. పైగా శ్రీశైలం ప్రసాదంలో కూడా కల్తీ జరిగిందంటూ ప్రస్తుతం తప్పుడు ప్రచారాలను తెరపైకి తెస్తున్నారని అన్నారు. ఏమి చేయాలో అర్థం కాక బాత్రూంలు శుభ్రపరిచే కెమికల్స్ నెయ్యిలో కలిపారంటూ ఈ కోణంలో విచారించాలని అనటం దారుణమని మండి పడ్డారు. ఏ అంశాల ఆధారంగా చంద్రబాబు ఆరోపిస్తున్నారు చెప్పాలని ప్రశ్నించారు.

పవిత్రమైన తిరుపతి లడ్డును ఎందరో కోట్లాదిమంది భక్తులు స్వీకరిస్తారని ఈ క్రమంలో ఈ విధంగా తప్పుడు ఆరోపణలు చేయటం వారిలో అపోహలని రేకెత్తించడమేనని అన్నారు. నిరాధారమైన ఆరోపణలతో హిందువుల మనోభావాలను దెబ్బతీయటం సరికాదని తెలిపారు. ఇప్పటికైనా రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేసే విధానానికి ముగింపు పలకాలన్నారు. కల్తీ నెయ్యి అంశాన్ని హైకోర్టు సుమోటోగా తీసుకొని విచ్చరించాలని లేదంటే తానే రిట్ పిటీషన్ వేస్తానని ఆయన తేల్చి చెప్పారు.

# గ్రామీణ ఉపాధి హామీపై 'వికాసిత' దాడి

### ఉపాధి కూలీలకు నష్టం చేసే విబిజిజి రామ్‌జి చట్టాన్ని రద్దు చేసి, పాత చట్టాన్ని కొనసాగించాలి : సిపిఐ డిమాండ్

విజేత,(ప్యాపిలి):

పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షత వహించగా, మండల కార్యదర్శి మహేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీఓ శ్రీవిద్యలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన సిపిఐ మండల కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ, భారతదేశ గ్రామీణ కష్టజీవుల జీవనానికి ఎంతో మేలు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ, కొత్త విబిజిజి రామ్‌జి చట్టాన్ని తీసుకురావడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు "పనైనా ఇవ్వండి, తిండైనా పెట్టండి" అనే నినాదంతో చేసిన పోరాటాల ఫలితంగా 2004లో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, వామపక్షాల సూచనలతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించిందని గుర్తు చేశారు. ఈ చట్టం రూపకల్పనలో పార్లమెంటు సభ్యులు, మేధావులు, ఐఏఎస్ అధికారులు, ప్రజాసంఘాలు విస్తృతంగా పాల్గొన్నారని తెలిపారు.




అప్పట్లో ఈ చట్టాన్ని బిజెపి తీవ్రంగా వ్యతిరేకించిందని, నేటి ప్రభుత్వం అదే ద్వేషంతో ఈ చట్టాన్ని రద్దు చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. మహాత్మా గాంధీ పేరుతో ప్రారంభమైన పని హక్కును కనుమరుగయ్యేలా చేయడం దుర్మార్గమన్నారు.

కొత్త చట్టం ప్రకారం ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 100 రోజుల ఉపాధి హక్కు తొలగిపోతుందని, కేంద్రం నోటిపై చేసిన కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పని కల్పిస్తారని విమర్శించారు. అలాగే నిధుల వాటాను 90:10 నుండి 60:40కు మార్చడం ద్వారా రాష్ట్రాలపై భారాన్ని మోపుతున్నారని అన్నారు. రాష్ట్రాలు తమ 40 శాతం వాటాను సమకూర్చలేకపోతే, కేంద్ర నిధులు కూడా తగ్గిపోవడం వల్ల ఉపాధి పథకం పూర్తిగా దెబ్బతింటుందని తెలిపారు.

ఉపాధి హామీ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వలసలు, ఆత్మహత్యలు తగ్గాయని, పేదల చేతిలో డబ్బు చలామణి పెరిగి కొనుగోలు శక్తి, సామాజిక గౌరవం పెరిగిందని గుర్తు చేశారు. అందుకే ఈ పథకాన్ని కాపాడుకోవడం కేవలం కూలీల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల సమిష్టి బాధ్యత అని స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త బిల్లును వెంటనే రద్దు చేసి, పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి, హమాలీ సంఘం నాయకులు శ్రీనివాసులు, రమేష్, రాము, రాఘవేంద్ర, రాజేష్, నాగన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్ల తమ్మిరాజుపేటలో అగ్నిప్రమాదం

### -పశువుల పాక, ధాన్యంపురి, గడ్డి వాములు టేకు తోట అగ్నికి ఆహుతి

### -స్పందించిన చలుమూరి-సంఘటన స్థలంలో సహాయక చర్యలు

అక్షర విజేత మెంటాడ: మండలంలోని తమ్మి రాజుపేట గ్రామంలో సోమవారం ఉదయం రైతు మన్నేల అక్కయ్య కు సంబంధించిన పశువుల శాల, ధాన్యం నిలవచేసే దాన్యంపురి నాలుగు గడ్డివాములు టేకు తోట అగ్నికి ఆహుతి అయ్యాయి. టిడిపి మండల అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు వెంటనే స్పందించి సంఘటన స్థలంలో దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టారు. సకాలంలో గ్రామస్తులు అప్రమత్తమై చర్యలు చేపట్టడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఉదయం బహిర్భూమికి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తి ధూమపానం చేసి పూర్తిగా ఆర్పకుండా పడవేసి వెళ్లిపోవడం వలన ఈ అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని ఫైర్ స్టేషన్ అధికారి ఎం ఎస్ ప్రసాద్ అన్నారు. ఈ మంటలు పక్కనే ఉన్న మన్నేల సోమేష్, సిరిపురం సత్యం, సిరిపురం పెద్ద నారాయణ, పంచాద కొండలమ్మ లకు చెందిన టేకు తోటకు వ్యాపించడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. వెంటనే స్థానికులు గజపతినగరం ఫైర్ స్టేషన్ కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది తక్షణమే స్పందించి ఫైర్ ఇంజన్ తో మంటలను అదుపు చేశారు. దానికి తోడు మండల టిడిపి అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏకమై సకాలంలో సహాయక చర్యలు చేపట్టడం వలన పెద్ద ప్రమాదంతో పాటు భారీ నష్టం తప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని చలుమూరి వెంకట్రావు, ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నాగ సంతోష్, ఫైర్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.





# స్వచ్ఛత పై ప్రజలకు అవగాహన కల్పించండి

## అధికారులను ఆదేశించిన కమిషనర్



విజేత,,(తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: ప్రజలలో స్వచ్ఛతపై అవగాహన పెంచాలని అధికారులను మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు ఆదేశించారు. 25 -26 సంవత్సరానికి స్వచ్ఛ సర్వేక్షణ అవార్డు సాధించడానికి తీసుకోవలసిన చర్యలు గురించి సోమవారం సమావేశం నిర్వహించారు. కమిషన్ మాట్లాడుతూ అవార్డు సాధించడానికి పట్టణాన్ని సత్యంగా ఉంచడంతోపాటు వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచాలన్నారు. అధికారులకు కార్మికులకు లక్ష్యాలను నిర్దేశించి పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యావరణ అధికారులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారులను తీర్చి దిద్దుతాం

## -మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు



విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: పట్టణంలోని ప్రధాన రహదారులను అందంగా తీర్చి దిద్దుతామని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు చెప్పారు. పట్టణంలో చేపట్టిన రోడ్డు డివైడర్ పెయింటింగ్ పనులను కమిషనర్ సోమవారం పరిశీలించారు. అధికారులు కార్మికులు పనులను త్వరితగతిని పూర్తి చేయాలని ఆయన కోరారు. పట్టణ ప్రజలకు సురక్షితమైన అందమైన వాతావరణాన్ని కల్పించేందుకు పురపాలక సంఘం కృషి చేస్తుందన్నారు

# మానవత్వం చాటుకున్న కమిషనర్



విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: పట్టణాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు ఆపన్నులకు కూడా సహాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. దీని ఉదాహరణ నాలుగో వార్డ్ లో రాయపాటి లక్ష్మి అనే మహిళ 7 నెలల అనారోగ్యంతో మంచాన పడింది. ఆమెకు ప్రభుత్వం నుంచి పింఛను మంజూరు కాలేదు. ఈ సంగతి తెలిసినా కమిషనర్ గత ఏడు నెలలుగా ఆమెకు నెలకు 5000 రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆమెకు పింఛన్ మంజూరు అయ్యేంతవరకు తను ఆర్థిక సాయం చేస్తానని ఆయన చెప్పారు. ఆమెకు పింఛన్ మంజూరు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు. కమిషనర్ ఔన్నత్యానికి లక్ష్మి ఆయనకు ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘ పరిధిలోని అర్హులైన వారందరికీ సహాయం చేయడానికి పరిపాల సంఘం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో హైయంతోపాటు పట్టణ ప్రణాళిక అధికారి జగదీశ్వరరావు, సిబ్బంది రజిని, విజయ్ పాల్గొన్నారు.

## ప్రజా క్షేమానికే అమ్మవారి జాతర -ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



విజేత, (తాడేపల్లిగూడెం) పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో: నియోజవర్గంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో క్షేమంగా ఉండాలని తాడేపల్లిగూడెం గ్రామ దేవత బలుసులమ్మ వారి జాతరను నిర్వహిస్తున్నట్లు శాసనసభ్యు లు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని పెద్ద తాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర నిమిత్తం ఎమ్మెల్యే ద్వారా ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరంగం ఐదు లక్షల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో జాతర నిర్వహించమని అమ్మవారి దయతో మళ్లీ ఇప్పుడు జాతర నిర్వహించే అవకాశం వచ్చింది అన్నారు. ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాము లై తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వాసవి ఇంజనీరింగ్ కాలేజ్ యాజమాన్యం జనసేన నాయకులు పాల్గొన్నారు.

# అమృత పల్లి జగ్గారావు కుటుంబాన్ని పరామర్శించిన గడ్డమనుగు రవికుమార్



విజేత జీలుగుమిల్లి

ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గం జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త అమృతవల్లి జగ్గారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. సోమవారం తాటియాకుల గూడెంలో పెద్దకార్యం కార్యక్రమం నిర్వహించారు. మృతుడి కుటుంబాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డ మణుగు రవికుమార్ పరామర్శించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. జనసేన పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకి గుర్తింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో తాటి యాకుల గూడెం సర్పంచ్ వనమా రాంబాబు, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు రాయి సుబ్బారావు ,బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, జనసేన గ్రామ వార్డు మెంబర్ అమృతవల్లి రవి, కూటమి నాయకులు గ్రామస్తులు పాల్గున్నారు